వెల్లివిరుస్తున్న దేశభక్తి

• వేములవాడలో నిత్య జనగణమణకు పక్షం రోజులు



జాతీయ గీతాలాపన చేస్తూ దేశభక్తి ప్రదర్శిస్తున్న స్థానికులు

వేములవాడ: వేములవాడలో దేశభక్తి వెల్లివిరుస్తోంది. నిత్య జనగణమణ పేరుతో పంద్రాగస్టు రోజున ప్రారంభమైన ఈ ప్రక్రియ నిత్యం ఉదయం సరిగ్గా 9 గంటలకు ప్రారంభమవుతోంది. కొద్దిసేపు అందరూ దేశభక్తిని చాటుకుందామంటూ అనౌన్స్‌మెంట్ వచ్చిన తర్వాత జాతీయ గీతం ప్లే చేస్తారు. దీంతో పట్టణంలోని ప్రధాన వీధి పాపన్నచౌక్, తెలంగాణచౌక్, మున్సిపల్, చాణక్య జంక్షన్, బద్దిపోచమ్మ, ప్రధానాలయం, అంబేడ్కర్ చౌరస్తా, అమరవీరుల స్తూపం, బస్టాండు ప్రాంతాల నుంచి వెళ్లేవారంతా ఎక్కడికక్కడే నిలబడి తమలోని దేశభక్తిని చాటుకుంటున్నారు. నిరంతరం జరిగే ఈ ప్రక్రియకు మున్సిపల్ సిబ్బంది విశేషంగా కృషి చేస్తున్నారు.

దేశభక్తి పెంపొందుతుంది



వేములవాడలో పదిహేను రోజులుగా నిత్య జనగణమణ ఉదయం 9 గంటలకు వస్తుంది. మంచి కార్యక్రమం. ప్రతీఒక్కరిలో దేశభక్తిని పెంపొందిస్తుంది. ఇలాగే కొనసాగించాలని కోరుకుంటున్నా.

– కటకం భూమయ్య, సీనియర్ సిటిజన్, వేములవాడ

క్లుప్తంగా

లంపీస్కిన్ కలకలం



లేగదూడ కళేబరం

వీర్నపల్లి: మండలంలోని భూక్య తండా గ్రామంలో భూక్య రఘుకు చెందిన లేగ దూడ లంపీస్కిన్ వ్యాధి లక్షణాలతో ఉండగా, బాబాయి చెరువుతండాలో నూనవత్ తిరుమలకు చెందిన లేగదూడ లంపీస్కిన్‌తో శుక్రవారం మృతిచెందింది. 15రోజులుగా నల్లటి మచ్చలు, దద్దుర్లు వచ్చి రక్తం కారుతుందని రైతులు తెలిపారు. ఈ విషయమై పశువైద్యాధికారిని సంప్రదించగా, లంపీస్కిన్ వ్యాధి అని తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువులను వేరే చోట ఉంచాలని, లేకుంటే మిగతా జంతువులకు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పాఠశాలల తనిఖీ



ముస్తాబాద్: మద్దికుంట ప్రాథమికోన్నత పాఠశాల, గూడెంలో ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో బన్నాజీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. చదువులో వెనకబడ్డ విద్యార్థులతో మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీపతి, బాపురెడ్డి, అంజిరెడ్డి తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన పత్రి ఉరఫ్ సుద్దాల పవన్ ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్ ద్వారా ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



ఎల్లారెడ్డిపేట: రాజన్నపేట, రాచర్లతిమ్మాపూర్, రాచర్లగొల్లపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అందజేశారు. మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు సత్యనారాయణ, గుడ్ల శ్రీనివాస్, చెన్ని బాబు, రాజేందర్, సత్తయ్య, రాంరెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో..

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన శివరాత్రి శేఖర్, పుల్లూరి శ్రీనివాస్‌కు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తాళ్లపెల్లి ప్రభాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు లంబ రాజు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముత్యాల శ్రీనివాస్, దుర్గం చిరంజీవి, రాజేందర్, రాజి రెడ్డి, దేవయ్య, లక్ష్మీరాజం, రవి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వీర్నపల్లి: మండలంలో చౌక ధరల దుకాణ డీలర్ల నియామకానికి అర్హత గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతిరెడ్డి శుక్రవారం తెలిపారు. వీర్నపల్లి చౌక ధర దుకాణం నంబర్ 3910009 ఎస్టీ జనరల్, గర్జనపల్లి గ్రామానికి చెందిన చౌక ధరల దుకాణం నంబర్ 3910010 ఎస్టీ మహిళ డీలర్ల నియామకానికి అవకాశముందని పేర్కొన్నారు.

బాల పురస్కారాలకు..

సిరిసిల్లకల్చరల్: కేంద్ర ప్రభుత్వం ప్రతిభావంతులైన బాల బాలికలకు ఇచ్చే పురస్కారాల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం కలెక్టరేట్‌లోని సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వడ్డీ వ్యాపారిపై కేసు

చందుర్తి: అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తున్న జోగాపూర్‌కు చెందిన గుంటి ప్రశాంత్‌పై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఏఎస్సై బాపు తెలిపారు. ఇతనిపై గతంలో కూడా అధిక వడ్డీలు వసూలు చేస్తున్న కేసు కూడా ఉన్నట్లు వెల్లడించారు.

రిజర్వేషన్ కల్పించాలి

ముస్తాబాద్: ముస్తాబాద్‌లో ఖాళీగా ఉన్న రేషన్ దుకాణానికి బీసీలకు అవకాశం కల్పించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు బీసీ సంక్షేమ సంఘం నాయకులు శీలం స్వామి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ముస్తాబాద్‌లో రేషన్ డీలర్ నియామక నోటిఫికేషన్ విడుదల చేశారని, బీసీలకే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ టీచర్లకు సన్మానం



ఇల్లంతకుంట: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రైవేటు స్కూళ్లకు దీటుగా తయారు చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సబిత అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పదవీవిరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి త్వరలోనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందుతాయన్నారు. టీచర్లు రహీమున్నీసా, సత్తెమ్మ,రాజవ్వ, శాంతమ్మతో పాటు నలుగురు ఆయాలను శాలువాతో సన్మానించారు. ప్రీ ప్రైమరీ స్కూల్ ట్రైనింగ్ పొందిన టీచర్లు కేంద్రాలలో ఇంప్లిమెంట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇల్లంతకుంట అంగన్‌వాడీ సెక్టర్ సూపర్‌వైజర్ చంద్రకళ, టీచర్లు అరుణ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు ఇవ్వాలి



సమ్మె నోటీస్ ఇస్తున్న కార్మికులు

బోయినపల్లి: ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బకాయిలు, వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని మధ్యాహ్న భోజన జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కార్మికులతో కలిసి స్థానిక ఎంఈవో కార్యాలయంలో సెప్టెంబర్ 9,10 తేదీలలో జరిగే టోకెన్ సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 10 వేల వేతనం, ప్రతీ నెల 5వ తేదీ లోపు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. సెప్టెంబ్ 9,10వ తేదీల్లో జరిగే సమ్మె విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు దూస వెంకటేశం, నడిగొట్టు లక్ష్మి, నర్సయ్య, కొమురయ్య, లావణ్య, ఐలవ్వ, కొమురవ్వ, నర్సవ్వ, భారతవ్వ తదితరులు ఉన్నారు.

అంగవాడీల సమావేశం

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ అంగన్వాడీ టీచర్ల సెక్టార్ సమావేశం శుక్రవారం పత్తికొండ పల్లె గ్రామ అంగన్వాడీ సెంటర్‌లో జరిగింది. సమావేశంలో సెక్టార్ సూపర్‌వైజర్ సూర్యకళ అంగన్వాడీ టీచర్ల రిజిస్టర్లను, నెలవారీ కార్యక్రమాలను పరిశీలించారు. సెక్టార్ పరిధిలోని 22 అంగన్వాడీ సెంటర్ల టీచర్లు పాల్గొన్నారు. కాగా గాలిపెల్లి-2 అంగన్వాడీ టీచర్ ఉద్యోగ విరమణ పొందడంతో అంగన్వాడీ సెంటర్-1 టీచర్‌కు ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. కందికట్కూరు అంగన్వాడీ కేంద్రం -2 టీచర్ ఉద్యోగ విరమణ పొందగా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం-3 టీచర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు సూపర్‌వైజర్ పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



అల్మాస్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై రమాకాంత్

ఎల్లారెడ్డిపేట: ప్రతి విద్యార్థి తమ రక్షణ కోసం పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రమాకాంత్ అన్నారు. అల్మాస్‌పూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలపై అందరు అవగాహనతో ఉంటే నేరాలను నియంత్రించొచ్చన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రంగి: విద్యార్థినులు, మహిళలు, బాలికలపై లైంగిక దాడులు అధికమవుతున్న నేటి సమాజంలో అప్రమత్తంగా ఉండాలని, మోసగాళ్ల చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో జిల్లా స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినులు, మహిళలు, బాలికలపై లైగింక వేధింపులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణ, వరకట్నం గృహహింస, పనిచేసే చోట లైగింక వేధింపులు, స్త్రీలు బాలికల అక్రమ రవాణా, టోల్‌ఫ్రీ నంబర్ 1811098, డయల్ 100 గురించి వివరించారు. సఖీ సెంటర్ కౌన్సిలర్ అంజలి, తంగళ్లపల్లి ఎస్సై దాస సుధాకర్, ప్రిన్సిపాల్ రమేశ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని కేంద్రంతో పాటు గర్జనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టంపై స్థానిక ఎస్సై ఎల్లాగౌడ్,సఖీ కేంద్రల నిర్వాహకులు శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు చట్టంపై వివరణ ఇస్తూ పలు సూచనలు, జాగ్రత్తలు తెలియచేశారు. మైనర్ బాల బాలికలపై లైంగికదాడుల గురించి తెలియజేస్తూ, ఏదైనా సమస్య, వేధింపులు జరిగితే భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు ఉంటాయని, అలాగే మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు వాడితే కఠిన శిక్షలకు గురవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

వీర్నపల్లి: కంచర్ల గ్రామంలో ఆర్ఐ ప్రవీణ్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండి సమస్యలపై స్పందించాలన్నారు. భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

సనాతన హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న అశోక్

ముస్తాబాద్: సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి పౌరుడు నడుం బిగించాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్ అన్నారు. ముస్తాబాద్ మాతృశ్రీ గార్డెన్స్‌లో హిందూ ధార్మిక సంఘాల సమావేశం శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ దేశంలో హిందూ సమాజం ఇబ్బందులను ఎదుర్కొంటుందన్నారు. ప్రపంచ ప్రజలకు శాంతిని పంచే హిందూవులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హిందువులంతా సంఘటితంగా వున్నప్పుడే వేల ఏళ్ల చరిత్ర కలిగిన హిందూ సంప్రదాయం, సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందిస్తామన్నారు. హిందు దేవి దేవతలను అవమానించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునేలా కృషి చేయాలన్నారు. గో సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. సమావేశంలో భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు గూడెపు దేవేందర్, కోల కృష్ణ, కాల్వ బాలాజీ, శ్రీనివాస్‌రావు, కార్తీక్‌రెడ్డి, కిట్టు, మ్యాన రాజేశ్, రమేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికకు దారి పరిశీలన



దారిని పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం కొడుముంజ గ్రామంలోని శ్మశాన వాటికకు దారిలేక గ్రామస్తులకు ఇబ్బందిగా మారింది. దీంతో శ్మశాన వాటికకు దారి ఏర్పాటు కోసం వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, తహసీల్దార్ మహేశ్ శుక్రవారం పరిశీలించారు. త్వరలోనే దారి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ కదిరె రాజుకుమార్, గ్రామస్తులు ఉన్నారు.

బదిలీపై ఉపాధ్యాయులకు సన్మానం

కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల ఉన్నత పాఠశాలలో బదిలీపై, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులు ఈగ శ్రీనివాస్, కదిరె గంగాధర్, పద్మజను శుక్రవారం సన్మానించారు. పాఠశాలలో కొంతకాలంగా పనిచేసిన వీరు ఇటీవల జరిగిన బదిలీల్లో వేరే పాఠశాలకు వెళ్లారు. వారిని సన్మానించి జ్ఞాపిక బహూకరించారు.

గ్రామాల్లో రైతుల వివరాలు నమోదు..

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధి శాత్రాజుపల్లి, మండలంలోని వట్టెంల, మారుపాక గ్రామాల్లో శుక్రవారం రుణమాఫీకి కాని రైతుల నుంచి వ్యవసాయ అధికారులు వివరాలు తీసుకుని యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్‌బేగం, వ్యవసాయ సహాయ సంచాలకుడు రామారావు, మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్, ఏఈవో రాజు, ఇనామిల్ తదితరులు ఉన్నారు.

బిల్లులు చెల్లించకుంటే కోడిగుడ్లు పెట్టలేం

కోనరావుపేట: పెండింగ్‌లో ఉన్న వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు చెల్లించకుంటే వచ్చే సోమవారం నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు కోడిగుడ్లు పెట్టలేమని మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవోకు వినతిపత్రాన్ని సమర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి మాట్లాడుతూ.. కొంతకాలంగా మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు అందడం లేదన్నారు. బాలామణి తదితరులున్నారు.

కేసీఆర్‌నగర్‌ను పంచాయతీ చేయాలి

తంగళ్లపల్లి: మండెపల్లి డబుల్ బెడ్ రూమ్‌ల(కేసీఆర్‌నగర్) సముదాయాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ కాలనీవాసులు శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యకు వినతిపత్రం అందజేశారు. మామిడాల రాజు, నల్ల మల్లికార్జున్, అడిచెర్ల శ్రీధర్, సంక శ్రీనివాస్, కొక్కుల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై ప్రజలకు నమ్మకం పెరిగింది

కోనరావుపేట: దేశంలో అధికారంలో ఉన్న బీజేపీపై ప్రజలకు నమ్మకం పెరిగిందని మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం అన్నారు. కోనరావుపేటలో శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అగ్ర రాజ్యాలతో పోటీ పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మిర్యాల్‌కార్ బాలాజీ, మోతుకు మోహన్, ఆకుల నాగరాజు, బెంద్రపు శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, దిలీప్, బాస్కర్, తిరుపతి, లచ్చిరెడ్డి, వీరమల్లు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో సీసీ కెమెరాలు

గంభీరావుపేట: ఎట్టకేలకు ఆర్టీసీ బస్సులలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటయ్యాయి. సిరిసిల్ల, వేములవాడ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవలి కాలంలో బస్సులలో గొడవలు జరుగడం, ఆర్టీసీ సిబ్బందితో వాగ్వివాదానికి దిగడంలాంటి సంఘటలను చోటు చేసుకుంటున్నాయి. అలాంటప్పుడు ఎవరిది తప్పో సులభంగా గుర్తించడానికి సీసీ కెమెరాలు దోహదపడనున్నాయి. అదేవిధంగా నేరాలు, చోరీల నియంత్రణకు ఉపయోగపడనున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటుపై పలువురు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట: గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులకు టాస్క్ అండ్ కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ప్రోగ్రామింగ్ ఏజెన్సియల్ ఇన్ పైథాన్‌పై శిక్షణిస్తున్నారు. శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్‌లో ఈ శిక్షణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశాలకు దోహదపడుతుందని టాస్క్ కోఆర్డినేటర్ జనగామ శ్రావణ్‌రావు అన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.విజయలక్ష్మి, రిసోర్స్‌పర్సన్ రత్న, అధ్యాపకులు ప్రభాకర్, ధర్మపురి, వాణి, ఆంజనేయులు, ఆదివిష్ణు, మనోహర్, శ్రీనివాస్, కృష్ణప్రసాద్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయాలి

గంభీరావుపేట: పాత పెన్షన్ పునరుద్ధరణకు డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న నిర్వహించనున్న పెన్షన్ విద్రోహ దినం ధర్నాను విజవంతం చేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాంపల్లి, వివేకానంద్ పిలుపునిచ్చారు.

వీహెచ్‌పీ మండల అధ్యక్షునిగా దేవేందర్

ముస్తాబాద్: విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడిగా గూడెపు దేవేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే బజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడిగా ప్రశాంత్ కిట్టు ఎన్నికయ్యారు. గోరక్షక్ దళ అధ్యక్షుడిగా చేపూరి రాకేశ్, ముస్తాబాద్ నగర సంయోజక్‌గా మద్దికుంట రమేశ్ ఎన్నికయ్యారు. వీహెచ్‌పీ కార్యవర్గ సభ్యులుగా బాదవేని శ్రీనివాస్, మ్యాన రాజేశ్, అబ్రమేని దేవేందర్, కొడిముంజ శ్రీనివాస్, కాల్వ బాలాజీ, బజరంగ్‌దళ్ మండల కార్యవర్గ సభ్యులుగా బండి ప్రశాంత్, కస్తూరి మధు, నవీన్, మేరుగు శ్రీరామ్, గొట్టె సాయి, కుడుకల మహేశ్, కనకయ్య, సుజిత్ ఎన్నికయ్యారు.

డీలర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి(ఓసీ/ఈడబ్ల్యూఎస్ మహిళ), ఆరెపల్లి(ఓసీ మహిళ), గొల్లపల్లి(ఎస్సీ జనరల్), పత్తికుంటపల్లి(ఈడబ్ల్యూఎస్/ఓసీ జనరల్) గ్రామాల్లో డీలర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం మండల రెవెన్యూ అధికారి ఎంఏ ఫరూక్ తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఆయా గ్రామాలకు చెందినవారై నలభైఏళ్లలోపు ఉండాలని, ఆసక్తి గలవారు సెప్టెంబర్ 4వ తేదీలోపు మండల రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

రాజన్నపేటలో దొంగతనం..

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన రాణవేణి దర్గవ్వ అనే వ్యక్తి ఇంట్లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని వివరాలు సేకరించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. సందీప్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బంధువుల గ్రామానికి వెళ్లగా, ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తలుపులు పగుల కొట్టి లోనికి ప్రవేశించి మూడు తులాల బంగారు పుస్తెల తాడు, 50 తులాల పట్టగొలుసులు, విలువైన సామగ్రి, బట్టలు, 10 వేల నగదును ఎత్తుకెళ్లారు. దొంగ తన వెంట తెచ్చుకున్న గడ్డ పారాను ఇంట్లోనే వదిలి వెళ్లాడు. క్లూస్ టీం సభ్యులు వేలి ముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలిస్తున్నారు.

పెన్షన్ విద్రోహ నిరసన విజయవంతం చేయండి

ఎల్లారెడ్డిపేట: సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట చేయనున్న నిరసనలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా జేఏసీ నాయకులు కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వారు మాట్లాడారు. సీపీఎస్, ఓపీఎస్ ఉపాధ్యాయులందరూ, అన్ని యూనియన్ల బాధ్యులు హాజరు కావాలని కోరారు.

వేములవాడ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా రాజిరెడ్డి

వేములవాడ: వేములవాడ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా రాజిరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్, సుల్తానాబాద్‌లో విధులు నిర్వహించిన రాజిరెడ్డి డీఐజీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా అతడిని వేములవాడకు బదిలీ చేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన సురేంద్రబాబును ఎల్లారెడ్డికి బదిలీ చేశారు. బదిలీలు జరిగి నెల రోజులు గడచినా వేములవాడ సబ్‌రిజిస్ట్రార్ పోస్టు భర్తీ చేయలేదు. ఎట్టకేలకు రాజిరెడ్డిని నియమించారు.

క్యాదర్శులకు సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో వందశాతరం ఇంటి పన్నుల వసూలుకు కార్యదర్శులు కృషి చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో సత్తయ్య కార్యదర్శులు బండారి సారిక, భూక్య లలిత, కారోబార్ శ్రీనివాస్‌లను శుక్రవారం ఘనంగా సన్మానించారు. మిగతా గ్రామాల కార్యదర్శులు, కారోబార్‌లు వీరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వందశాతం పన్నులు వసూలు చేసిన వారిని ఉన్నతాధికారులు సన్మానిస్తారని, పన్నుల వసూలుపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏంపీవో రాజు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల గ్రామం ఐదోవార్డు మెయిన్‌రోడ్డుపై వర్షం నీరు నిలిచి ఇళ్లల్లోకి వస్తుందని, దీంతో పాత ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామానికి చెందిన నాయకుడు మంద శేఖర్ గౌడ్ శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోకి వర్షం నీరు చేరుతుందన్నారు. వర్షం నీరు నిల్వఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.


ముగ్గురికి జరిమానా

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్, అక్కపల్లి గ్రామాలకు చెందిన ముగ్గురు గతంలో బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి తిరిగి నేరాలకు పాల్పడడంతో తహసీల్దార్, అధికారులు శుక్రవారం వారికి జరిమానా విధించారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన అనరాశి కిష్టయ్య పాత ఇనుప సామాను దుకాణం నిర్వహిస్తూ దొంగలించిన సామాన్లను కొనుగోలు చేయగా.. గతంలో ఎస్సై రమాకాంత్ అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అప్పటి నిబంధనలు అతిక్రమించి దొంగ సొత్తును మళ్లీ కొనుగోలు చేయగా.. కిష్టయ్యను అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. రూ.25వేల జరిమానా విధించారు. అక్కపల్లికి చెందిన మందాటి సంతోష్, రాచర్లబొప్పాపూర్‌కు చెందిన బొమ్మనవేణి పర్శరాములు బెల్ట్ షాపులు నిర్వహిస్తుండగా.. గతంలో పోలీసులు అరెస్ట్ చేశారు. బైండోవర్ సమయంలో పలు నిబంధనలు విధించి వదిలిపెట్టగా.. తిరిగి బెల్ట్ షాపులు నిర్వహిస్తుండడంతో వారిని శుక్రవారం అరెస్ట్ చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. పర్శరాములుకు రూ.25వేలు, సంతోష్‌కు రూ.10వేల జరిమానా విధించారు.

విషపురుగు కాటుతో గేదె మృతి

వీర్నపల్లి: మండలంలోని బాబాయి చెరువు తండా గ్రామంలో విషపురుగు కాటుతో గేదె మృతి చెందినట్లు రైతు బానోత్ రమేశ్ తెలిపారు. మృతి చెందిన బర్రె సుమారు రూ.లక్ష ఉంటుందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో జయశీల

బోయినపల్లి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో భీమా జయశీల పేర్కొన్నారు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడలను శుక్రవారం ప్రారంభించారు. ఆమె మట్లాడుతూ ఆరోగ్యానికి క్రీడలు దోహదపడుతాయన్నారు. నర్సింగాపూర్ హైస్కూల్ ఉపాధ్యాయుడు కొండం దుర్గారెడ్డి విజేతలకు మెడల్స్ వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, ఎంఎస్‌వో శ్రావణ్‌కుమార్, బొలగం శ్రీనివాస్, ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి, మధూకర్, సంతోష్, గడప సత్యనారాయణ, జగన్‌మోహన్, తిరుమల, సురేందర్, వనజ సీఆర్పీలు బొడ్డు తిరుపతి, ప్రసాద్ ఉన్నారు.

ఆధ్యాత్మికం

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు



తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణ చివరి శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు.

పెద్దమ్మ తల్లి సల్లంగా చూడు..

ముస్తాబాద్: అందరిని సల్లంగా చూడు తల్లీ అంటూ మండలకేంద్రంలోని ముదిరాజ్‌లు పెద్దమ్మ ఆలయాల్లో శుక్రవారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు కుంకుమపూజలు, ఒడి బియ్యం సమర్పించారు. ఏటా పూజలు నిర్వహిస్తామని సంఘం బాధ్యులు తెలిపారు. అనంతరం పోచమ్మ ఆలయంలో పూజలు చేసి భక్తులకు అన్నదానం చేశారు. సంఘం బాధ్యులు నీరటి సత్యం, పూల్లూరి రవి, కంచం నర్సింలు, రాములు, పిట్ల రాములు, దేవేందర్, రమేశ్, మాజీ ఎంపీటీసీ కంచం మంజుల తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



గంభీరావుపేట: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరిదేవి(నాయకమ్మ) ఆలయంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సంఘం నాయకులు అన్నదానం చేశారు. కూర సురేశ్, బొప్ప దేవయ్య, తోట ఆగయ్య, నారాయణరావు, వెంకటస్వామిగౌడ్, గంధ్యాడపు రాజు, రాజం, బాల్‌రెడ్డి, గంట శ్రీనివాస్, రాజశేఖర్, పల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు



ఎల్లారెడ్డిపేట: మండలంలోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారంను పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వరలక్ష్మి వ్రతాలు చేశారు. కార్యక్రమంలో పండితులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రాజన్నకు శ్రావణ సందడి



వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో శ్రావణమాసం సందడి నెలకొంది. శ్రావణమాసం రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలో శుక్రవారం పుట్టువెంట్రుకల వేడుకలు ఊపందుకున్నాయి. ఉదయం కురిసిన వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.